కులగణనపై కేంద్రం త్వరగా నిర్ణయం తీసుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

కోటగిరి, ఫిబ్రవరి 16 : కేంద్ర బడ్జెట్‌ను సవరించడంతోపాటు కులగణనపై కేంద్రం త్వరగా నిర్ణయం తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వారు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదవర్గాలకు కాకుండా కార్పొరేట్ వ్యక్తులు, సంపన్న వర్గాల కోసం కేటాయించిన విధంగా ఉన్నదని విమర్శించారు. బడ్జెట్‌ను వెంటనే సవరించి, అమలుచేయాలని డిమాండ్ చేశారు. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఆమోదింపజేసి బిల్లును ముందుకు తీసుకురావాలన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్, నల్ల గంగాధర్, బాలరాజు, సతీశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాజేసిన డబ్బులు ఇప్పించాలని ఫిర్యాదు

రుద్రూర్, ఫిబ్రవరి 16 : తన బంధువులు ఏటీఎం కార్డును దొంగిలించి, డబ్బులు విత్‌డ్రా చేశారని, డబ్బులు తిరిగి ఇప్పించాలని రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన బుష్రాబేగం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. బుష్రాబేగం భర్త మరణించిన అనంతరం భర్త తరపు కుటుంబీకులు తనను ఇబ్బందుల పాలు చేస్తున్నారని, మాజీ ప్రజాప్రతినిధి అయిన తన బావ ఏటీఎంను చోరీ చేసి, పెట్రోల్ బంకుల్లో రెండు దఫాలుగా మొత్తం ఒక లక్షా తొమ్మిది వేల రూపాయలను డ్రా చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, తన డబ్బులను తనకు ఇప్పించి, న్యాయం చేయాలని కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్వింద్ స్థాయికి మించి మాట్లాడుతున్నాడు

- కులగణన విషయంలో బీజేపీ వైఖరి ఏమిటో తెలపాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

కంఠేశ్వర్, ఫిబ్రవరి 16 : ఎంపీ అర్వింద్ స్థాయికి మించి మాట్లాడుతున్నాడని, కులగణన విషయంలో బీజేపీ వైఖరి ఏమిటో తెలుపాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ.. ఝూటా బద్మాష్ పార్టీ అని, బీసీలుగా ఉన్న బీజేపీ నాయకులు బీసీ కులగణను వ్యతిరేకిస్తున్నారని, అది వారి పిచ్చితనానికి నిదర్శనమన్నారు. సమావేశంలో నాయకులు నరాల రత్నాకర్, గోపి, వేణురాజ్, నరేందర్‌గౌడ్, జావిద్, అక్రమ్, రోహిత్, ప్రీతం పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఇందల్వాయి, ఫిబ్రవరి 16 : ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌కు మున్నూరుకాపు మండల నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మండల మున్నూరుకాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పులిసాగర్, గడ్కోల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు విఠల్, శ్రీనివాస్, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

108 సిబ్బందికి కనీస సౌకర్యాలు కరువు

- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న 108 అంబులెన్స్ సిబ్బంది

పొతంగల్, ఫిబ్రవరి 16 : ఒక్క ఫోన్‌కాల్‌తో అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులు, బాధితులకు వైద్యసేవలు అందించేందుకు 108 సిబ్బంది కృషిచేస్తున్నది. ఘటనాస్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి, దవాఖానలో చేర్పించి, ప్రాణాలు కాపాడడంతో 108 సిబ్బంది తీసుకునే చొరవ అంతా ఇంతా కాదు. అలాంటి సిబ్బందికి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొతంగల్ మండలంలో రెండు నెలల క్రితం నూతనంగా 108 అంబులెన్సు సేవలు ప్రారంభించారు. ఈ 108లో ఇద్దరు ఈఎంటీలు, ఇద్దరు పైలెట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు టీములుగా ఏర్పడి విధుల్లో ఉంటారు. వారు సేద తీరడానికి దవాఖాన ఆవరణలోని యోగశాల గదిని తాత్కాలికంగా ఇచ్చారు. అందులో మూత్రశాలలు, మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలు లేకపోయినా వారు గదిని వినియోగిస్తున్నారు. అయితే, కొన్ని రోజుల నుంచి యోగశాలకు యోగా చేసేందుకు స్థానికులు ఉదయం, సాయంత్రం రావడంతో వారికి ఇబ్బంది తప్పడం లేదు. రాత్రి సమయంలో విధులు నిర్వర్తించి, సేద తీరాలనుకుంటే ఉదయం పూట ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యోగ సాధకులు వచ్చిన సమయంలో తాము సామగ్రితో బయటికి వెళ్లాల్సి వస్తున్నదని, వారు వెళ్లిన అనంతరం తిరిగి గదిలో సేదతీరుతున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీస సౌకర్యాలు ఉన్న ప్రత్యేక గదిని తమకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

యోగశాల వద్ద నిలిపి ఉన్న 108 అంబులెన్సు వాహనం

> కనీస సౌకర్యాలు ఉన్న గదిని ఏర్పాటు చేయాలి

తాత్కాలికంగా ఇచ్చిన యోగశాలలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. దీంతో ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుంది. యోగ శాల షెడ్డుకు చుట్టూ జాలి మాత్రమే ఉండడంతో దోమలు, చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు కనీస సౌకర్యాలు గల గదిని ఏర్పాటు చేయాలి.

- నారాయణ, ఈఎంటీ

కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు, పెట్రోల్‌బంక్ డీలర్లు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 16 : కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని హెచ్‌పీసీఎల్ ఆర్‌ఎం శ్రీనివాస్ అన్నారు. నగరంలోని కొత్త కలెక్టరేట్ రోడ్‌లో మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్ సూచనల మేరకు హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో సాక్షం -2025 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంధనాన్ని పొదుపుగా వాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. పొదుపులో భాగంగా ప్రత్యామ్నాయ వనరులైన సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాల వైపు వినియోగదారులు మొగ్గు చూపాలన్నారు. వాతావరణంలో మార్పులకు కాలుష్యం ప్రధాన కారణమని, ప్రజలు కాలుష్య రహిత వాతావరణం కోసం ఇంధన వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ అధికారి యతేంద్ర కోమా, డీలర్లు కర్క శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌నాథ్, వినోద్‌రెడ్డి, సందీప్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కింగ్ కోఠి టు ఆర్మూర్

- విస్తరించిన బైక్స్ స్కామ్
- యథేచ్ఛగా బైక్స్ మాఫియా ఆగడాలు
- కొత్త బైక్‌ల చోరీ డ్రామా, బీమాసంస్థల నుంచి క్లెయిమ్ చేసుకుంటున్న అక్రమార్కులు
- వెలుగు చూసిన బోగస్ ఏజెన్సీల బండారం
- ఆర్మూర్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున బైకుల సీజ్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 16 : కింగ్ కోఠి నుంచి ఆర్మూర్ వరకు బైక్ స్కామ్ విస్తరించింది. భారీ కుంభకోణంగా భావించి రంగంలోకి దిగిన పోలీసులు.. వివరాలపై ఆరా తీస్తున్నారు. ఈ స్కామ్ వెనుక ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ ప్రజాప్రతినిధి హస్తమున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు అక్రమార్కులు హైదరాబాద్‌లోని కింగ్ కోఠిలో వివిధ సంస్థలకు సంబంధించిన కొత్త బైక్‌లను విక్రయించే ఏజెన్సీలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఏజెన్సీలు పేరు మోసిన కంపెనీల నుంచి కొత్త బైక్‌లు కొంటారు. వాటిని నిబంధనల ప్రకారం వినియోగదారులకు విక్రయించకుండా బైక్‌లు చోరీకి గురయ్యాయని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తారు. ఆ బోగస్ ఏజెన్సీల మాటలు నమ్మి.. పోలీసులు కేసులు నమోదు చేస్తారు. ఆ కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ ఆధారంగా చోరీకి గురైన బైక్‌లకు బీమా సొమ్ము క్లెయిమ్ చేయిస్తారు. అనంతరం ఆ బైక్‌లు ఎలాంటి రిజిస్ట్రేషన్ పత్రాలు లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోని అమాయకులకు విక్రయిస్తూ మరోమారు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముఠా కొన్ని బైక్‌లను సగం ధరలకే అమ్ముకోవడం, మరి కొన్ని బైక్‌ల విడిభాగాలు అమ్ముకోవడం చేస్తున్నారు. ఈ బైక్‌లను ఇతర రాష్ట్రాలు లేదా మారుమూల గ్రామాల్లో తక్కువ ధరకు విక్రయించడమే పనిగా పెట్టుకున్నారు. ఈ మాఫియా ఆగడాలు ఆర్మూర్ నియోజకవర్గంలో విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఈ బోగస్ ఏజెన్సీల బండారం బయటపడడంతో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేటుగాళ్ల కోసం వేట మొదలుపెట్టారు.

ఆర్మూర్‌లో బైకులు సీజ్

ఆర్మూర్ నియోజకవర్గంలోనే విక్రయించిన దొంగ బైక్‌లను పోలీసులు సీజ్ చేశారు. అంకాపూర్‌లో 5, మిర్దాపల్లిలో 10, డొంకేశ్వర్‌లో 2, మైలారంలో 15 దొంగ బైక్‌లను పోలీసులు సీజ్ చేయడం ఆర్మూర్ నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ బీజేపీ ప్రజాప్రతినిధి పలువురు అనుచరులతో పాటు ఆయన బావమరిది ఈ బైక్ స్కాంలో పాత్రధారులని పోలీసులు భావిస్తున్నారు. బైక్‌ల కేసును మాఫీ చేసేందుకు సదరు నాయకుడు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఈ స్కామ్ దర్యాప్తు వేగవంతంగా సాగడం లేదన్న విమర్శలు వస్తున్నారు. పోలీసుల తీరుపై ఇన్‌చార్జి సీపీ ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. బైక్‌ల కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టి, దోషులను శిక్షించాలని ఆర్మూర్‌కు చెందిన బాధితులు కోరుతున్నారు.

బెంగుళూరు ఏసీ బస్సుల్లో 10 శాతం తగ్గింపు ఆఫర్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 16 : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బెంగుళూరు ఏసీ బస్సుల్లో బేసిక్ టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ ప్రకటించిందని రీజినల్ మేనేజర్ జ్యోత్స్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకుని, 10 శాతం తగ్గింపు ధరలతో సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని కోరారు. హైదరాబాద్ నుంచి బెంగుళూర్ రూట్లలో అన్ని ఏసీ బస్సుల్లో ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం సంస్థ వెబ్‌సైట్ ద్వారా లేదా సమీప బస్సు రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు.

కవితలు, కథల పోటీలకు ఆహ్వానం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16 : హరిదా రచయితల సంఘం, నవ్యభారతి గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి సరస్వతీ రాజ్ హరిదా అంశంపై తెలంగాణ భాషలో కవితలు, కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ కవితకు రూ.10 వేల నగదు పురస్కారం అందజేస్తామని తెలిపారు. మే 30వ తేదీలోగా తమ కవితలను 9030033331 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని, మరిన్ని వివరాలకు అదే నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

లంబాడా పోరాట హక్కుల సమితి కార్యవర్గం ఎన్నిక

నియామకపత్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు మోహన్

ధర్పల్లి, ఫిబ్రవరి 16 : లంబాడా పోరాట హక్కుల సమితి మండల కార్యనిర్వాహక ప్రెసిడెంట్‌గా సొసైటీ డైరెక్టర్ మలావత్ నాసీనాయక్, ఉపాధ్యక్షుడిగా కేతావత్ విఠల్‌నాయక్, ప్రధానకార్యదర్శిగా శంకర్, యువ విభాగం అధ్యక్షుడిగా కేతావత్ శ్రీకాంత్‌నాయక్, ప్రధానకార్యదర్శిగా మలావత్ బాలు, సంయుక్త కార్యదర్శిగా మలావత్ ప్రకాశ్, ప్రచార కార్యదర్శిగా మలావత్ ఉమేశ్‌ను ఎన్నుకున్నారు. వారికి జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్ ఆదివారం నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రూరల్ ఇన్‌చార్జి మెగావత్ సరిచంద్, నాయకులు కేతావత్ వల్లీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 16 : భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కాకతీయ, శ్రీభాష్యం, ఎస్ఆర్ విద్యాసంస్థల్లో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ న్యాయవాది రాజేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రణాళికతో, భయాందోళనకు గురికాకుండా వార్షిక పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రజనీకాంత్, నాగరాజు, మహేశ్, గణేశ్, వేణు, మారుతి, వైష్ణవి, దుర్గ, బాబూరావు, సాయి, విశాల్, కిరణ్, మహేశ్, నవీన్, క్రిష్, మహేందర్, సంతోష్, నిశాంత్, విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ కొట్టాడని ఏసీపీకి ఫిర్యాదు

ఎడపల్లి, ఫిబ్రవరి 16: ఏ తప్పూ లేకున్నా అకారణంగా బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు తనను కొట్టాడంటూ రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన మహిళ బోయి భాగ్య ఆదివారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 13న మండలంలోని జానకంపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో జాతరకు వెళ్లాలని, తన పర్సు చోరీకి గురికావడంతో దానిని వెతికించాలంటూ పోలీసుతో వాదనకు దిగగా అక్కడే ఉన్న బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు లాఠీతో కొట్టాడని తెలిపింది. సీఐపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఆలయంలో అన్నదానం పేరుతో డబ్బులు వసూలు చేస్తే సమాచారం ఇవ్వాలి

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 16: బోధన్ పట్టణంలోని ప్రధాన మారుతీ మందిరంలో ప్రతి మంగళవారం అన్నదానం చేస్తున్నామని చెబుతూ కొందరు వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దేవాదాయశాఖ ఈవో, ఆలయ అర్చకుడు ప్రవీణ్ మహారాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో మంగళవారం అన్నదానం చేయడం లేదని, కాషాయరంగు దుస్తులు ధరించిన వ్యక్తులు పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. బియ్యం, డబ్బులు, పప్పు దినుసులు తదితర సామగ్రి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ వ్యక్తులతో ఆలయానికి సంబంధం లేదని, సదరు వ్యక్తులకు ఎవరైనా దానాలు చేస్తే వారే బాధ్యులని, లేదా సదరు వ్యక్తులను పట్టుకొని తమకు సమాచారం అందించాలని ఆలయ అర్చకుడు కోరారు.

కన్నుల పండుగలా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మాక్లూర్, ఫిబ్రవరి16: మండలంలోని అడవిమామిడిపల్లి గ్రామ శివార్‌లోని శ్రీ అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ (వార్షిక) బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు అదివారం స్వామి వారి కల్యాణం ప్రధాన అర్చకుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ అమృతలతారెడ్డి, ప్రభాదేవి, రమాదేవి, లలిత, వసంత, సురేందర్‌రెడ్డి, వీడీసీ సభ్యులు డీసీ గంగాధర్, మల్లారెడ్డి, సర్పంచ్ మల్లారెడ్డి, భక్తులు, వేడుకల్లో పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 16: సాలూరా మండల కేంద్రంలో పేకాడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.11,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. అ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిధులున్నా.. నిరుపయోగం

- పూర్తికాని గ్రంథాలయ మొదటి అంతస్తు భవన నిర్మాణ పనులు
- 14 నెలల కిత్రం మంజూరు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- పాత లైబ్రరీలో సౌకర్యాలు లేక పాఠకులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు

అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ మొదటి అంతస్తు భవనం

నవీపేట, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన గ్రంథాలయ మొదటి అంతస్తు భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తి అవుతున్నా భవన పనులు పూర్తి కాక పోవడంతో పాఠకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు భవన నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నవీపేట లైబ్రరీ మొదటి అంతస్తు భవన నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరయ్యాయి. 2023 అక్టోబర్ 5న మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు ప్రారంభమైన తర్వాత వేగంగా సాగాయి. స్లాబ్, గోడలు నిర్మించి డోర్లు, కిటికీలు బిగించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పర్యవేక్షించేవారు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

పాత భవనంలో సౌకర్యాలు కరువు..

నవీపేట మండల జనాభాకు అనుగుణంగా 40 ఏండ్ల క్రితం ప్రభుత్వం నవీపేటకు గ్రంథాలయాన్ని మంజూరు చేసింది. కొన్నేండ్లు అద్దె భవనంలో కొనసాగిన లైబ్రరీ పదేండ్ల క్రితం పక్కా భవనం నిర్మించారు. కానీ నిత్యం గ్రంథాలయానికి వస్తున్న పాఠకులకు సరైన సౌకర్యాలు లేవు. మూత్ర శాలలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం లైబ్రరీలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 916 మంది సభ్యులుగా ఉన్నారు. రోజూ విద్యార్థులు, యువకులు వయస్సుపై బడిన వారు సైతం గ్రంథాయానికి వచ్చి వినోదానికి సంబంధించిన పుస్తకాలతోపాటు నవలలు, దిన పత్రికలు చదుతుంటారు. సౌరర్యాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠకుల అభ్యర్థన మేరకు అన్ని హంగులతో గ్రంథాలయానికి మొదటి అంతస్తు భవన నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది.

పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం

మండల కేంద్రంలో నిలిచి పోయిన గ్రంథాలయ మొదటి అంతస్తు పనులను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనుల్లో కొంత జాప్యం ఏర్పడిన మాట వాస్తవమే. ప్రస్తుతం నిధులున్నాయి. సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేసి పాఠకులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– అత్తర్ హైమద్, రాజీవ్ విద్యా విషయన్ ఏఈ

ప్రమాదకరంగా వంతెన

ప్రమాదకరంగా మారిన వంతెన

- బైపాస్ రోడ్డులో కూలిపోయిన సైడ్‌వాల్స్
- పక్కనే గుంతలు
- పట్టించుకోని అధికారులు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 16: బోధన్ పట్టణ శివారులోని ఆచన్‌పల్లి ప్రాంతం నుంచి మహారాష్ట్రకు వెళ్లే బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు గుండా మహారాష్ట్రకు వెళ్లే వాహనాలతోపాటు, రెండు ప్రధాన ఆలయాలు ఉండడంతో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఈ మార్గంలో వస్తుంటారు. రోడ్డు పక్కనే ఉన్న పాండు చెరువుకట్టపై ఆత్మలింగేశ్వర ఆలయం, కొంచెం దూరంలో బొర్రన్న మందిరాలు ఉన్నాయి. ఈ మందిరాలకు భక్తులు వస్తుండడంతోపాటు, మహారాష్ట్రకు పలు వాహనాలు వెళ్తుంటాయి. ఈ రహదారి ప్రారంభంలోనే చెరువు అలుగువద్ద ఉన్న వంతెనకు ఇరువైపులా సైడ్‌వాల్స్ కూలిపోయి ఉన్నాయి. పక్కనే పెద్దగుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో దగ్గరకు వచ్చే వరకూ ఈ గుంతలు కనిపించవని వాహనదారులు అంటున్నారు. అక్కడే మూల మలుపు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్ రూరల్, ఫిబ్రవరి 16: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. బోధన్ మండలం కల్దుర్కి గ్రామం నుంచి పెగడపల్లి మీదుగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు



కమ్మర్‌పల్లి మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవాకేంద్రం

మోర్తాడ్, ఫిబ్రవరి 16: కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాజశ్రీనివాస్ తెలిపారు. కులగణన సర్వేలో మిగిలిపోయిన కుటుంబాల కోసం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆదివారం నుంచి మరోసారి సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఈకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈనెల 28 వరకు సర్వేలో పాల్గొనని వారు ప్రజాపాలన కేంద్రంలో వివరాలు ఇవ్వాలని, లేదా ఫోన్ చేస్తే అధికారులు ఇంటికి వచ్చి సర్వే చేస్తారని చెప్పారు. ఇంటి వద్దే ఫారం నింపి కేంద్రంలో కూడా ఇవ్వవచ్చని తెలిపారు. సర్వేలో పాల్గొనని కుటుంబాలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి16: ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో పాల్గొనని వారు ఆర్మూర్ పట్టణంలో 73 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామని మున్సిపల్ కమిషనర్ రాజు ఆదివారం తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న సర్వేలో పాల్గొనని వారు వివరాలను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో అందజేయాలని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెలవు రోజుల్లోనూ ప్రజాపాలన సేవా కేంద్రం పని చేస్తుందని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రుద్రూర్, ఫిబ్రవరి 16 : రుద్రూర్ నుంచి వర్ని వెళ్లే ప్రధాన రహదారి పక్కన కంచె లేకుండా ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన మూగజీవాలు సేద తీరుతున్నాయి. పొరపాటున విద్యుత్ షాక్ తగిలితే అక్కడికక్కడే మృతిచెందే ప్రమాదం ఉన్నది. కనీసం అ